

కక్షలు, కార్పణ్యాలు వుండవు
అభివృద్ధి మా అజెండా: మంత్రి మండిపల్లి



సోమలలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి

ప్రజాశక్తి- పుంగనూరు: కక్షలు, కార్పణ్యాలు మన ప్రభుత్వపాలనలో ఉండదని అభివృద్ధి అజెండాగా పనిచేస్తున్నామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. పుంగనూరు జడ్పీ అతిథి గృహంలో ల్యాండ్స్, ఎక్సైజ్, మైన్స్ అండ్ జువాలజీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. సమీక్షా సమావేశాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పి.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు కలిసి మంత్రివర్గంలో ఒకరికే స్థానం కల్పించాలని, ఆ అవకాశం తనకే దక్కిందన్నారు. మైనింగ్ శాఖ అధికారులు 2019 నుండి 24 నియోజకవర్గ వివరాలను తెలుపుతుండగా పుంగునూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా బాబు మైనింగ్, క్వారీలకు సంబంధించి ఎంతమంది టెండర్లు వేశారని వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. అలాగే గత పాలనలో గ్రానైట్ దిమ్మెల ద్వారా వచ్చినటువంటి వేస్ట్ మెటీరియల్‌కు డబ్బులు ఏమైనా చెల్లించరా లేదా అన్న విషయాలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. పుంగనూరు మున్సిపాలిటీ పర్యటన ఉదయం 11 గంటలకు అని చెప్పి సాయంత్రం 5 గంటలకు మంత్రి రావడంతో కార్యకర్తలు పూర్తిస్థాయిలో నిరుత్సాహపడ్డారు. తూర్పు మగసర్ నుంచి మంత్రి ర్యాలీ ప్రారంభం కాగా భారీగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిటి రోడ్డు తాజ్ మహల్ సమీపంలోనూ, ఇందిరా సర్కుల్లోనూ క్రేన్ ద్వారా గజమాలను వేయడం జరిగింది. అలాగే స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సుమారు ఏడు గంటలపాటు కార్యకర్తలు నిరీక్షించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమావేశంలో పలమనేరు ఆర్‌డిఓ మనోజ్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్‌ఈ విజయ్ కుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ విజయ్ కుమార్, జిల్లా మధ్య నిషేధ ఆబ్కారీ శాఖ అధికారి ఆయేషా బేగం, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

సీతమ్మ చెరువు పునర్నిర్మాణంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తా..

సోమల: సోమల మండలం ఆవులపల్లె గ్రామ సమీపంలోని సీతమ్మచెరువు పునర్నిర్మాణంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఈ ప్రాంత రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం ఆవులపల్లె రైతుల విజ్ఞప్తి మేరకు సీతమ్మచెరువు వద్ద గత ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన భారీ రిజర్వాయర్ నిర్మాణ పనులను రిజర్వాయర్ నిర్మాణం వల్ల నష్టపోయిన రైతుల బాధలను సావకాశంగా మంత్రి విన్నారు. రిజర్వాయర్ నిర్మాణం వల్ల నష్టపోయిన భూ నిర్వాసితులకు న్యాయం జరిగే విధంగా కచ్చితంగా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, పలమనేరు ఆర్డిఓ మనోజ్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్సీ విజయ్ కుమార్ రెడ్డి, పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు మానుకోవాలి
కలెక్టరేట్ ఎదుట స్కీమ్ వర్కర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్కీమ్ వర్కర్లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నేటివరకు జిల్లాల్లో వివిధ రంగాల కార్మికులను అక్రమంగా తొలగించడానికి నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో భారీ ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి స్కీంవర్కర్ల సంఘం గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేంద్రన్ మాట్లాడుతూ ఈ తొలగింపులన్నీ రాజకీయ అక్రమ తొలగింపులే అని, దీనికి చట్టబద్ధత లేదని అన్నారు. స్థానిక గ్రామపెద్దలు కక్షలతో తొలగించడం సిగ్గు చేటన్నారు. కొత్తవారిని ఈ ఖాళీలలో ఉద్యోగాల్లో నియమించి లక్షలో డబ్బులు దండుకోవాలన్నది కొందరు నాయకుల ప్రయత్నమని, జిల్లాల్లో కార్మికులను బలవంతంగా ఉద్యోగాల నుండి బయటకు గెంటివేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోని విఓఎ, ఆర్‌పిలు (వెలుగు), మధ్యాహ్న భోజన కార్మికుల (వంటమ్మలు), ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా, అంగన్వాడీ, మున్సిపల్ తదితర ప్రభుత్వ రంగాల్లో పని చేసే వేలాది మంది కార్మికులను తొలగించే హక్కు వీరికి ఎవరు ఇచ్చారని, ఏ చట్టప్రకారం తొలగిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాలో మధ్యాహ్న భోజనం, విఓఎ, ఫీల్డ్ అసిసెంట్లు, ఆశా, అంగన్‌వాడీలతో సహా అక్రమంగా 350 మందిని తొలగించారని తెలిపారు. ఉద్యోగులు ఎవరైనా తప్పు చేస్తే మెమోలు ఇవ్వాలి, కార్మికుల నుండి సంజాయిషీ తీసుకోవాలి, దీనిపై అధికారులు సంతృప్తి చెందకపోతే విచారణ చేయాలి అంతేకానీ విచారణ చేయకుండా తొలగించడమనేది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమన్నారు. కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించడమంటే కార్మికునికి ఉరిశిక్ష వేయడం లాంటిదే అన్నారు. రాజకీయ నాయకులు రాజీనామా పత్రం తయారు చేసి బలవంతంగా సంతకాలు పెట్టించినంత మాత్రన ఆ రాజీనామా చెల్లదని, ఈ రాజీనామా పత్రాలు ఎందుకూ పనికి రావు అన్నారు. టిడిపి నాయకులు కొందరు అధికారం వున్నదని అహంభావంతో తప్పుడు విధానాలు అవలభించడం సరికాదు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం లాగా ఉద్యోగుల తొలగింపులకు తెలుగుదేశం నాయకులు ఉసికొల్పుతున్నారని, చిన్న ఉద్యోగులయితే ఏమీ చేయలేరని భావించడం సరికాదన్నారు. చిన్న ఉద్యోగులు ఒంటరిగా లేరని ఇప్పటికైనా వేధింపులు మానుకోకపోతే భవిష్యత్తులో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్తా అధ్యక్షత వహించగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లలిత, షకీలా, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, జిల్లా కార్యదర్శి నాగరాజు, మధ్యాహ్న భోజనం యూనియన్ జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు జిల్లా అధ్యక్షులు అన్నామలై, స్కీం వర్కర్లు పాల్గొన్నారు. అనంతరం ఇంచార్జ్ కలెక్టర్ రాజశేఖర్‌కి వినతిపత్రం చేశారు.

కుప్పం నూతన డీఎస్పీగా పార్థసారథి



ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం రెవెన్యూ డివిజన్ నూతన డీఎస్పీగా పార్థసారథి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కుప్పం రెవెన్యూ డివిజన్ మొదటి డీఎస్పీగా బాధ్యతలు నిర్వహించిన శ్రీనాథ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. అలాగే విజయవాడ ఎన్టీఆర్ కమిషనరేట్‌లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పార్థసారధిని కుప్పం డీఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నూతన డీఎస్పీని ప్రజాశక్తి మేనేజర్ ప్రసాద్, చిత్తూరు, తిరుపతి జిల్లాల బ్యూరో గోపి, డివిజనల్ ఇంచార్జ్ రామాంజనేయులు, విలేకరి కన్నన్ కలిసి అభినందనలు తెలిపారు.

డెంగీతో విద్యార్థిని మృతి



వసతి గృహ వార్డెన్ నిర్లక్ష్యంతోనే..

ప్రజాశక్తి- పుంగనూరు

గిరిజన వసతి గృహంలో ఉన్న విద్యార్థినికి డెంగీ జ్వరం రావడంతో సరైన చికిత్సలు అందించకపోవడంతో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. సోమల మండలం 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీకి చెందిన ఇర్లపల్లి గ్రామానికి చెందిన పరిగెంటి వెంకటరమణ, ఈశ్వరమ్మ కూలి చేసి జీవనం సాగించే వారు వీరికి ఇద్దరు పిల్లలు. పూర్ణిమ(11) 7వ తరగతి పుంగనూరు మేలుపట్ల గిరిజన సంక్షేమ వసతి గృహంలో చదువుతోంది. గత కొన్ని రోజులుగా తీవ్రంగా జ్వరం రావడం వసతి గృహవార్డెన్ శ్రద్ధ తీసుకోకపోవడంతో చిన్నారి మృతి చెందిందని తెలుస్తోంది. వారం రోజులుగా జ్వరంగా ఉన్నా.. తల్లిదండ్రులకు వార్డెన్ ఆలస్యంగా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. వారు విద్యార్థిని ఇంటికి తీసుకెళ్లి మండలంలోని నంజంపేట గ్రామంలో ఓఆర్‌ఎంపి దగ్గర చికిత్స నిర్వహించారు. జ్వరం తగ్గకపోవడంతో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చూపించారు. అక్కడ వైద్యులు సూచన మేరకే తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పూర్ణిమ మృతి చెందింది. సోమవారం దహన క్రియలు నిర్వహించారు. తల్లిదండ్రుల నిరక్షరాస్యులు కావడం, వార్డెన్ నిర్లక్ష్యంతో చిన్నారి మృతి చెందిందని తెలుస్తోంది..

అక్రమ విద్యుత్ వాడకంపై విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: గుడిపాల మండలం, కొత్తపల్లి సెక్షన్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పాలసముద్రం, చెత్త పారా, దిగువ పిల్లారి కుప్పం, అమ్మవారిపల్లి, చింతగుంట, రామభద్రపురం, చలిచిములపల్లి, బొమ్మసముద్రం, కోటూరు మొదలైన గ్రామాలలో ఎస్పీడీసీఎల్ విజిలెన్స్ సిబ్బంది సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న పలు ఇల్లులు, షాపులపై 75 కేసులు నమోదు చేసి, 3 లక్షల 32 వేల రూపాయలు పైగా జరిమానా విధించారు. విద్యుత్ అక్రమ చౌర్యం చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి విజిలెన్స్ విభాగం ఈఈ పుల్లా బాలాజీ, పూర్ణచంద్ర కుమార్, నరసింహమూర్తి, హరినాధ రాజా, చలపతి, కష్ణయ్య, శ్రీనివాస రావు పాల్గొన్నారు.


విద్యావసరాలు తీర్చేందుకు 'ఆషా' సిద్ధం

ప్రజాశక్తి - రేణిగుంట

గిరిజన కాలనీ లోని పిల్లలు చదువుకునేందుకు అవసరమైన ఎటువంటి సహాయం చేయడానికైనా ఆషా స్వచ్ఛంద సంస్థ సిద్ధంగా ఉంటుందని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు అన్నారు.రేణిగుంట మండలం గురవరాజు పల్లి పంచాయతీ లోని యానాది కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన రెండు బోర్డ్ లను ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు సోమవారం ఉపాధ్యాయులకు అందించారు. జూలియన్ రాజు మాట్లాడుతూ చిన్న కాలనీలో 25 మంది విద్యార్థులు వచ్చి చదువుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు.ఇందుకు కషిచేసిన ఉపాధ్యాయులకు పిల్లల్ని క్రమం తప్పకుండా పంపుతున్న తల్లిదండ్రులకు కతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల అభ్యున్నతి కోసమే ఆషా స్వచ్ఛంద సంస్థను స్థాపించామన్నారు. కార్యాక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి, సురేష్,వార్డు మెంబర్ సుబ్బమ్మ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 196 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్‌ఎస్)లో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని డ్వామా పిడి, ఇన్చార్జి డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లోని నూతన భవనంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో డ్వామా పిడి, ఇన్చార్జి డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, డిఆర్‌డిఏ పిడి తులసి, డిప్యూటీ కలెక్టర్ భవానీలు పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 196 అర్జీలు అందగా ఇందులో శాఖలవారీగా వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖ 149, పోలీస్‌శాఖ 2, డిఎస్‌ఓ 1, విద్యాశాఖ 2, చిత్తూరు నగరపాలక సంస్థ 5, నగరి మున్సిపాలిటీ 1, బిసి వెల్ఫేర్‌శాఖ 1, ఫారెస్ట్ శాఖ 2, వ్యవసాయ శాఖ 1, ఇండస్ట్రీస్ 2. పశు సంవర్ధకశాఖ 2, మైన్స్‌శాఖ 1, డిఎం అండ్ హెచ్‌ఓ 1, సిపిఓ 1, డిసిహెచ్‌ఎస్ 1, నేషనల్ హైవే 4, ఐసిడిఎస్ 1, సర్వశిక్ష అభియాన్ 1, ఆర్ అండ్ బి 1, డిపిఓ1, ఎపిఎస్‌పి డిసిఎల్ 3, ఎంపిడిఓ బంగారుపాళ్యం 1, ఇరిగేషన్‌శాఖ 1, స్కిల్ డెవలప్మెంట్ 1, ఎపిఓ విజయపురం 1, చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ 1, ఎస్‌సి కార్పొరేషన్ 1, ఎంపిడిఓ కుప్పం 1, హౌసింగ్ 5 , ఎంఈవో బంగారుపాళ్యం 1. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న డ్రామా పీడీ రాజశేఖర్

ఉచితంగా ఇసుక ఇవ్వాలి

భవన నిర్మాణ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - గూడూరు టౌన్


వినియోగదారులందరికీ ఇసుకను ఉచితంగా ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వివేకానందరోడ్డు, ముత్యాలపేట, రైతుబజారు మీదుగా రాజావీధి, గాంధీబొమ్మ, సంఘం థియేటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఉచిత ఇసుక ఇవ్వాలని, భవన నిర్మాణ పనులకు ఇబ్బంది లేకుండా చూడాలని నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా నాయకులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికుల కడుపు కొట్టిందన్నారు. సంక్షేమ బోర్డును రద్దు చేసిందన్నారు. జీవో 12, 14 తీసుకొచ్చి కార్మికుల కడుపు కొట్టిందన్నారు. గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్ మాట్లాడుతూ గూడూరు పరిసర ప్రాంతాల్లో ఇసుక లేక రోజువారీ పని చేసుకునే కూలీలు ఇంటికే పరిమితమయ్యారన్నారు. ఈ మేరకు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీవో స్పందిస్తూ బాలిరెడ్డిపాలెం సర్కిల్లో ఇసుక క్వారీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య,



నాయకులు సేలం సేకరాచారి, గండికోట మధు, ఎస్.డి.రఫి, సిఐటియు నాయకులు బి.వి.రమణయ్య, పట్టణ కార్యదర్శి ఎస్.సురేష్, అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రులకు వరం.. రైతులకు శాపం!

20 ఏళ్లలో 12శాతం నిర్వాసితులకు మాత్రమే ప్యాకేజి
పదేళ్లుగా పోలవరం ప్రాజెక్టులో దోపిడీ..
బీసీ యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్



ప్రజాశక్తి- పుంగనూరు: పోలవరం ప్రాజెక్టులో గడిచిన కొన్నేళ్లుగా దోపిడీ జరగడం తప్ప.. పనుల్లో ప్రగతి కనిపించడం లేదని బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ధ్వజమెత్తారు. కొందరు అధికారులు, పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆయన ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన స్పిల్ వే, ఛానెల్, కాఫర్ డ్యాములు, డయా ఫ్రమ్ వాల్ సహా ఇతర నిర్మాణ పనులను దగ్గరుండి చాలాసేపు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సాంకేతికంగా చేయాల్సిన పనులు ముందు చేయకుండా కమీషన్లు, కాసుల కోసం అత్యవసరంగా కొన్ని పనులు చేసేశారని ఆ కారణంగా గత పదేళ్లలో పోలవరం ప్రాజెక్టు పురోగతి అగమ్యగోచరంగా మారిందన్నారు. కాఫర్ డ్యాములు పూర్తిగా నిర్మించకుండా డయా ఫ్రమ్ వాల్ నిర్మాణం, అది కూడా నాణ్యత లేకపోవడం, నీటిని మళ్లించడంలో సాంకేతిక పద్ధతులు పాటించకపోవడం వంటి తప్పుల కారణంగా ప్రాజెక్టు నిర్మాణం మూడు అడుగులు ముందుకు.. ఆరు అడుగులు వెనక్కు కదులుతుందని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన సహకారాన్ని వాడుకోకుండా, రెండు ప్రభుత్వాలు కేవలం కాసుల కోసం వారికి నచ్చిన వారికి కాంట్రాక్టులు ఇచ్చుకుని.. అవినీతికి పాల్పడ్డారని దుయ్యబట్టారు.. కేవలం ఇది పాలకులకు మాత్రమే వరంగా మారిందని.. రైతులకు, నిర్వాసితులకు శాపంగా మారిందని ఆయన తెలిపారు.

స్పెషల్ చిల్డ్రన్‌కు శ్రీవారి ఆశీస్సులు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - రేణిగుంట: రోటరీ క్లబ్, టిటిడి చెన్నై స్థానిక సలహా కమిటీ సంయుక్తంగా స్పెషల్ చిల్డ్రన్ లకు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం కల్పించాయి. చెన్నై నుంచి శ్రీవారి దర్శనార్థం 1008 మంది స్పెషల్ చిల్డ్రన్ సోమవారం ఉదయం రేణిగుంట రైల్వేస్టేషన్ కు చేరుకోగా వీరికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్ నుంచి తిరుమలకు స్పెషల్ చిల్డ్రన్ ను తీసుకువెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ఈ బస్సు లను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. స్పెషల్ చిల్డ్రన్ లతో ఎమ్మెల్యే ముచ్చటించారు. కళ్ళు కనపడని బాలుడుతో శ్రీ వెంకటేశ్వర స్వామిని ఎలా చూస్తావు అని ఎమ్మెల్యే



అడగగా తాను చూడకపోయినా స్వామి తనను చూస్తాడని బదులిచ్చారు. స్పెషల్ చిల్డ్రన్స్ కోసం టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రత్యేకంగా దర్శన ఏర్పాటు చేయడాన్ని అభినందిస్తునట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహావీర్ బోత్రా, ఈవెంట్ చైర్మన్ పంకజ్ కంకరియా, జనసేన శ్రీకాళహస్తి ఇంచార్జీ వినూత, టిడిపి కార్పొరేటర్ ఆర్సీ మునికష్ణ, జనసేన తిరుపతి నగర అధ్యక్షులు రాజారెడ్డి, సుధాకర్, బాబ్జీ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారంలో అలసత్వం చేయకండి

అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆరిఫుల్ల



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశానుసారం ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆరిఫుల్ల ఆదేశించారు. సోమవారం జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 39 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆరిఫుల్లని, మహిళా డీఎస్పీ సుధాకర్ రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 39 ఫిర్యాదులు అందాయి, వాటి వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ తగాదాలు 5, బాలిక మిస్సింగ్ 1, వేధింపులు 3, ఇంటి తగాదాలు 1, డబ్బు తగాదాలు 8, భూ తగాదాలు 16, ఆస్తి తగాదాలు.

క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలి : కమిషనర్


చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో ఐదు వినతులు అందినట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు సహాయ కమిషనర్ రామకృష్ణుడు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య విభాగం 1, మెప్మా 2, రెవెన్యూ 2 చొప్పున మొత్తం ఐదు వినతులు అందాయి. వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందే వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎంహెచ్వో డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అర్జీల స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణుడు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్‌గార్డెనర్ల సమస్యలపై సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో డ్రామా పిడి రాజశేఖర్‌కి సానిటరీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ అనే కార్యక్రమం మొదలుపెట్టి పెట్టిన్నప్పుడు పంచాయతీ పరిధిలో పని చేస్తున్నటువంటి పారిశుధ్య కార్మికులకు రూ.6వేలు జీతం ఇస్తున్నారని, దాదాపు పది సంవత్సరాలు కావస్తున్నా అదే జీతానికి పనిచేయాల్సి వస్తోందని పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరారు.



వినతిపత్రం అందిస్తున్న వర్కర్స్ యూనియన్ నాయకులు

ఐటిఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఐటిఐ ప్రవేశాలకు మూడవ విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెదురుకుప్పం ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ భైరవుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి 27న సాయంత్రం 5గంటల లోపు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9533723022, 9492571731, 9533394950 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సబ్సిడీ పరికరాల కోసం..

ప్రజాశక్తి-శాంతిపురం: రాయితీపై ప్రభుత్వం అందించే బిందు సేద్యం పరికరాల కోసం అర్హులైన రైతులు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఎంపిఎవో సాయి శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు పాస్బుక్ జిరాక్సులను సహాయకులకు అందజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. 5ఎకరాల లోపు భూమి ఉన్న చిన్న సన్నకారు రైతులకు 90శాతం, ఐదు నుంచి పది ఎకరాలు లోపు ఉన్న రైతులకు 70 శాతం, స్ప్రింక్లర్ల మంజూరుకు చిన్న సన్నకారు రైతులకు 55శాతం ఐదు ఎకరాల కంటే ఎక్కువ ఉన్న రైతులకు 45శాతం రాయితీతో పరికరాలను అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తహశీల్దార్‌కి సత్కారం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌ను సోమవారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించారు. నాయకులు స్వామి దాస్, శ్రీధర్ యాదవ్, దేవసుందరం, వెంకటేష్, జీవరత్నం తదితరులు ఉన్నారు.

బైరెడ్డిపల్లి: మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మాధవరాజుకు రేషన్ డీలర్లు సోమవారం ఘనంగా సత్కరించారు. యూనియన్ నాయకులు రవిచంద్ర బాబు, టీవీ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాపై ధర్నా



ధర్నా చేపడుతున్న బాధిత కుటుంబం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: తాము తాతల కాలం నాటి నుంచి సాగు చేసుకుంటున్న భూమిని కబ్జా కబ్జా చేశారంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. సోమవారం బైరెడ్డిపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా చేపట్టారు. వారికి దళిత సంఘం నాయకులు మద్దతు తెలిపారు. జోక్యం చేసుకున్న తహశీల్దార్ మాధవరాజు వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. బాధితురాలు వెంకటలక్ష్మి తహశీల్దార్‌కు వివరిస్తూ.. గతంలో రెవెన్యూ అధికారులు వేరొకరికి పట్టా ఇప్పించి తమ భూమిని చూపించారని, అయితే తాము సాగు చేసుకుంటున్న భూమిలో అలా చేయడం దారుణమని మొరపెట్టుకున్నారు. దీంతో తాను విషయాన్ని పరిశీలించి తగు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు చెల్లించాల్సిన ఐదు నెలల పెండింగ్ వేతనాన్ని వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు కోదండయ్య, నాగరాజు మాట్లాడుతూ అనేక సందర్భాల్లో వివిధ రూపాల్లో పోరాటాలు స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. సంబంధించిన కాంట్రాక్టర్ విజయవాడలో కూర్చుని జీతాలు అడిగితే ప్రభుత్వాలు మారుతున్న కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం చూపలేదన్నారు. కనీస వేతనం కూడా ఇవ్వకుండా కార్మికులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలన్నారు.

ఘనంగా టీడీపీ నేత పుట్టిన రోజు వేడుకలు



ప్రజాశక్తి-రామకుప్పం, కుప్పం టౌన్: టిడిపి రాష్ట్ర నేత, కుప్పం విస్తరణ విభాగ కన్వీనర్ డాక్టర్ సురేష్ బాబు పుట్టిన రోజు వేడుకలను మండల టిడిపి, బిజెపి, జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక ఆటో సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున కేక్ కత్తిరించి ఒకరికొకరు పంచుకొని సురేష్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు పూలమాలలు వేసి, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అన్న క్యాంటీన్‌లో అన్నదాన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మునస్వామి, నారాయణచారి, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, చలపతి, కృష్ణ నాయక్, శ్రీరాములు రెడ్డి, మనోహర్, విజయ్ రెడ్డి, సుబ్రి తదితరులు పాల్గొన్నారు.

విజయపురం తహశీల్దార్‌గా కిరణ్



ప్రజాశక్తి-విజయపురం: విజయ పురం తహశీల్దార్‌గా కిరణ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇతను చిత్తూరు టౌన్ డిప్యూటీ తహశీ ల్దార్‌గా పనిచేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విజయపురం తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై రైతు సమస్యలపై న్యాయం చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. రెవిన్యూ సిబ్బంది పలువురు ప్రముఖులు ఆయనను దుశ్శాలువలతో సన్మానించారు.

వసతి గృహంలోకి వర్షపు నీరు





ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బంగారుపాళ్యం మండల కేంద్రంలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో వీధులన్నీ వర్షపు నీరుతో నిండిపోయాయి. ప్రభుత్వ బాలికల వసతి గృహంలోకి వర్షపు నీరు చేరింది. దీంతో వసతి గృహంలోకి చేరుతున్న నీటిని నిలువరించేందుకు బాలికలు తీవ్రంగా శ్రమించారు. అయినా ఫలితం లేకపోయింది. హాస్టల్లోకి పూర్తిగా నీళ్లు చేరిపోయాయి. కాగా ఇదే విధంగా పది ఏళ్లప్పుడు కురిసిన వర్షం కారణంగా అప్పట్లోనూ ఇదేవిధంగా జరిగిందని అక్కడి స్థానికులు తెలిపారు.

వసతి గృహాన్ని పరిశీలన

నీట మునిగిన బాలికల వసతి గృహాన్ని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. వసతి గృహ వార్డును సమీపంలోని ప్రభుత్వ



పాఠశాలలో ఉంచాలని వారికి సూచించారు. అవసరమైన భోజన వసతులను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

విద్యార్థి దశలో మత్తుకు బానిస కావొద్దు

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, స్వచ్ఛంద సేవా సంస్థ రాస్ ఐఆర్‌సిఏ సహకారంతో పొగాకు, గుట్కా మత్తు పదార్థాల నిషేధం మీద అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి మాట్లాడుతూ యువత పొగాకు ఉత్పత్తుల వాడకం వలన దుష్పరిమాణాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాస్ కౌన్సిలర్ పి.నాగరాజు మాట్లాడుతూ విద్యార్థి దశలో మత్తుకు బానిస కావద్దు సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి మాట్లాడుతూ పొగాకు వాడకం ప్రాణానికి హానికరం అని తెలిసినా, సరదాగా మొదలైన అలవాటు వ్యసనంగా మారి ప్రాణాలనే బలి తీసుకుంటుందని, మనదేశంలో ఏటా సుమారు 13.5లక్షల మంది పొగాకు వాడడం వల్ల మరణిస్తున్నారని పొగాకు ఉత్పత్తుల వల్ల ప్రజలకు




డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

ప్రజారోగ్యానికి సమాజానికి పర్యావరణానికి హాని కలుగుతుందని, ఈ పొగాకు ఉత్పత్తుల నిషేధంలో ప్రతి యువత భాగస్వామ్యం కావాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రాస్ పీర్ ఎడ్యుకేటర్ ఎం.దామోదరం, కళాశాల అధ్యాపకులు డాక్టర్ హరిబాబు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సీఎన్ లతా, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పట్టణ పరిధిలోని ఎన్‌టీఆర్ వ్యవసాయ మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. సోమవారం అయన స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఎన్‌టీఆర్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. ఇందులో భాగంగా అర్థంతరంగా ఆగిపోయిన భవనాలను పరిశీలించారు. అనంతరం టమోటా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 2014–19 మధ్యకాలంలో టీడీపీ అధికారంలో ఉండగా చంద్రబాబు కుప్పం అభివృద్ధిలో భాగంగా వ్యవసాయ మార్కెట్‌ను నిర్మించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా శీతల గిడ్డంగులను సైతం నిర్మించడానికి పనులు ప్రారంభించినట్టు తెలిపారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో టిడిపి అధికారం కోల్పోయిందని, అనంతరం అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వంలో కుప్పం అభివృద్ధి కేవలం ప్రసంగాలకు మాత్రమే పరిమితమైందన్నారు. అందుకు నిదర్శనమే అర్థాంతరంగా నిలిచిపోయిన మార్కెటింగ్ కమిటీ భవనాలు అని అన్నారు. కుప్పం ప్రజల అదృష్టం కొద్దీ ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ గెలుపొంది, తిరిగి సీఎంగా చంద్రబాబు ఎన్నిక కావడంతో కుప్పం అభివృద్ధి తిరిగి ప్రారంభమైందన్నారు. వీలైనంత త్వరగా ఎన్‌టీఆర్ వ్యవసాయ మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కుప్పం పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాణిపాకం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం: కడా పీడీ



ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని కడా కార్యాలయంలో పిడి వికాస్ మరమ్మత్ ఆధ్వర్యంలో ప్రజల వద్ద నుంచి పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. 25 అర్జీలు అందగా అందులో 20 అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించినట్టు ఆయన తెలిపారు. స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించి, కాల పరిమితి మించకుండా సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

కుప్పం ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా కడా పిడి వికాస్ మరమ్మత్ చర్యలు చేపడుతున్నారు. మండలానికి చెందిన సీగలపల్లి గ్రామంలో దళిత సామాజిక వర్గానికి చెందిన 30కుటుంబాలు శ్మశానానికి దారి చూపాలంటూ కడా పీడీని కోరారు. ఈ విషయమై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో కలిసి స్థానికంగా సమస్యను పరిశీలించి, త్వరలో పరిష్కార మార్గం చూపుతామని హామీ ఇచ్చారు.

10న ఆదిశంకరలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈ నెల 10వ తేదీ గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ మురగదాస్ పేర్కొన్నారు. గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకరా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మురగదాస్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని అనేక బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ప్రత్యేక ప్రతిభావంతులు కూడా జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఇమ్మానుయేల్ , విజయనిర్మల పాల్గొన్నారు.

తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మండల నూతన తహశీల్దారు శివరామ సుబ్బయ్యను దళిత సంఘాల నాయకులు సోమవారం దుశ్శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ పోరాట సమితి అధ్యక్షులు బాదురు ఎల్లయ్య మాట్లాడుతూ చంద్రగిరి మండలంలో దళిత సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తమకు తెలపడానికి ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తే మీ దృష్టికి తీసుకొస్తామని వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

నీటి నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-పెద్దపంజాణి:



మండలంలోని కోగిలేరు పంచాయతీలో జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో కేంద్ర బృందం సోమవారం మంచినీటి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలకులు రాజకుమార్ పంచాయతీ పరిధిలోని కోగిలేరు, బసవరాజుకండ్రిగ, పొట్టగానిపల్లిలో మంచి నీటి ట్యాంకులు, ప్రభుత్వ పాఠశాలలు, గ్రామాల్లోని పలు ఇళ్ల వద్ద మంచినీటిని పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14 వరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామాల్లో మంచినీటి నాణ్యత ప్రమాణాలను పరిశీలించడంతో పాటు గ్రామాల్లో మంచినీటి కొరకు ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించనున్నట్లు తెలిపారు. దీంతో రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు మరిన్ని నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ హేమలత, ఎంసీవో సుధాకర్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ వనజ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకి సంజీవని

- సిడిపివో కల్పన



ప్రజాశక్తి-శాంతిపురం: తల్లిపాలే బిడ్డకు సంజీవిని అని ఐసిడిఎస్ శాంతిపురం ప్రాజెక్టు అధికారి కల్పన అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని ఆరిముత్తనపల్లె అంగన్వాడి కేంద్రంలో వారోత్సవాలను నిర్వహి ంచారు. ఆమె మాట్లాడుతూ.. బాలింతలు బిడ్డ పుట్టిన ఒక గంట సేపు లోపలే బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. దీంతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టగానే ముర్రుపాలు ఇవ్వడం వలన రోగనిరోధక శక్తి పెరుగుతుంది డబ్బా పాలు వద్దు అమ్మపాలు ముద్దు అని తల్లులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు కృష్ణవేణి, సుగుణ, ఎంఎల్‌హెచ్‌పి పూజ, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురం: మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆహారమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకమరాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని శ్రీహరిపురం అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాలు పిల్లల మేధస్సును మెరుగుపరచడంలో సహాయపడుతుందని ఆరోగ్య కార్యకర్త చందన వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు సుజాత, విజయ, ఆశ కార్యకర్త సుజాత పాల్గొన్నారు.



పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యత

- మినీ గోకులాలు పథకంతో పశువులకు రక్షణ
- ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పాడి పరిశ్రమ అభివృద్ధికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే మినీ గురు కులాల ఏర్పాటు పథకం పశువులకు రక్షణ కల్పిస్తుందని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వడమాలపేట మండలం టిసి అగ్రహారంలో గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం, లేగ దూడల ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ లేగ దూడల పెంపకం పట్ల పాడి రైతులకు అవగాహన కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరెన్నో నిర్వహించాలని పాడి పరిశ్రమ అభివృద్ధికి తాను కృషి చేస్తానని, పాడి రైతులు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ క్యాంపులో 50 పేయదూడలు వివిధ పాడి రైతులు తీసుకొచ్చి పాల్గొన్నారు. బలిష్టంగా ఉన్న మూడు దూడలను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారు లు గుర్తించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ ఉచిత పశు వైద్య శిబిరంలో 62 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. రైతులు మేలు జాతి దూడలను పొంది, దూడల పెంపకంలో అనుసరించాల్సిన మెలకువలను పశు వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాఖ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బాట గంగమ్మ సేవలో ఎమ్మెల్యే



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బాట గంగమ్మ ఆలయంలో సోమవారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు కిషోర్ గౌడ్, సుబ్రహ్మణ్యం శెట్టి, భువనచంద్ర గౌడ్, అరుణ్, అంబరీష్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



ప్రజాశక్తి-పలమనేరు: రెండు వేర్వేరు చోట్ల అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలమనేరు టౌన్ పరిధిలో పద్మశ్రీ సర్కిల్ వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లికి చెందిన మంజునాథ బైక్‌పై 960 ఒరిజినల్ ఛాయిస్ 90ఎంఎల్ టెట్రా ప్యాకెట్లును తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా పలమనేరు బైపాస్ రోడ్డులోని గంగవరం ఫ్లై ఓవర్ వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో పుదుచ్చేరి నుంచి అక్రమంగా తరలిస్తున్న 120కొరియర్ నెపోలియన్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మదనపల్లికి చెందిన రామాచారిని అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్ఈబీ ఎస్ఐ దత్తాత్రేయ, సిబ్బంది దేవరాజులు, కృష్ణమాచారి, సతీష్ బాబు, సయ్యద్ బాషా, అల్తామసు, చక్రి నాయక్ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి ప్రదానం



ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్ 2024 వ సంవత్సరం పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ఇదే పాఠశాలలో (1995–96 బ్యాచ్) చదివిన పూర్వ విద్యార్థి జాకీర్ హుస్సేన్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. 1995–96 విద్యా సంవత్సరంలో పిచ్చాటూరు జెడ్పీ హైస్కూలులో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం గత ఏడాది నిర్వహించారు. ఈ సమ్మేళనంలో తాము చదువుకున్న పాఠశాలకు ఏదైనా మంచి చేయాలనుకున్నారు. 10వ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి మొదటి, ద్వితీయ స్థానంలో నిలిచే విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున ఇద్దరికీ కలిపి మొత్తం రూ.10 వేలు అందించాలని జాకీర్ హుస్సేన్ నిర్ణయించారు. ఈ మేరకు 2024 పదవ తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన ఈ పాఠశాల విద్యార్థి సోమశేఖర్ (579 మార్కులు) 560 మార్కులతో ద్వితీయ స్థానం పొందిన మదన్‌కు ప్రోత్సా హక నగదును పూర్వ విద్యార్థి జాకీర్ హుస్సేన్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల 1995–96 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు రియాజ్, కిరుబకరణ్, హెచ్.ఎమ్ గిరి ప్రకాష్ పాల్గొన్నారు.

'నిషేధిత జాబితా నుండి ఆ సర్వే నెంబరును తొలగించాలి'



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ఆటోనగర్‌లో కార్మికుల కోసం ఏపీఐఐసి కేటాయించిన సర్వే నెంబర్లు గతంలో రిజిస్ట్రేషన్ అయ్యేవని, 2017లో ఈ సర్వే నెంబర్లు 74/7, 95/2ను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిషేధిత జాబితా నుండి ఈ సర్వే నెంబర్లను తొలగించాలని ఎస్వీ ఆటోనగర్ అసోసియేషన్ నాయకులు హరిబాబు, ప్రసాద్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2000లో ఏపీఐఐసి ద్వారా తిరుపతి రేణిగుంట మార్గంలో అక్కారంపల్లి సర్వే నెంబర్ 74/7, మంగళం సర్వే నెంబర్ 95/2లోని 32 ఎకరాల 7 సెంట్ల భూమిలో 350 ప్లాట్లు వేసి ఇక్కడి కార్మికులకు రిజిస్ట్రేషన్ చేసి జీవనోపాధి కల్పించారన్నారు. వయస్సు మీదపడి వ్యక్తిగత అవస రాలకు ఈ స్థలాన్ని బ్యాంకులలో తనఖా పెట్టడానికి గాని, విక్రయాలు చేసుకోవడానికి వీలు లేకుండా చేశారన్నారు. నిషేధిత జాబితా నుండి ఈ సర్వే నెంబర్లను తొలగించాలని కోరుతూ మంత్రి లోకేష్‌కు, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శికి లేఖలు రాశామని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వరరావు, పురుషోత్తం, రామలింగం పాల్గొన్నారు.

సమాజ హితం కోసం అహర్నిశలు శ్రమించేది జర్నలిస్టులే: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమాజ హితం కోసం అహర్నిశలు శ్రమించేది జర్నలిస్టులే అని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో తిరుపతి వార్త పక్ష ప్రతిక 10వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యకమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తనకు జర్నలిస్టులంటే అభిమానమని, గతంలో చిత్తూరు ఎమ్మెల్యే ఉండే సమయంలో అక్కడి 170 మంది జర్నలిస్టులకు నగరం మధ్యలో జర్నలిస్టు కాలనీని ఏర్పాటు చేయించానన్నారు. ఇప్పుడు తిరుపతి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తాను అండగా నిలుస్తానన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ సోంత భవనం నిర్మాణానికి స్థలం ఇస్తామని గతంలో చంద్రబాబు మాట ఇచ్చారని ఈ విషయంలో సహాయ సహాయ సహకారాలను అందివ్వాలని జర్నలిస్టులు కోరగా సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు నిరుపేద జర్నలిస్టులకు 10 బియ్యం బస్తాలను అందించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత ఎన్‌వి ప్రసాద్, మాజీ టీటీడి డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, టిడిపి నేత వూకా విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రెడ్ సంస్థ సేవలు అభినందనీయం: డాక్టర్ రోహిణి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక త్యాగరాజా వీధిలోని కళ్యాణ వీరభద్ర స్వామి ఆల యంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో37 మంది ప్రత్యేక ప్రతిభా వంతులకు సోమవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాత పోతుర్రి విజయకుమారి ఐదు వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రతీ నెలా క్రమం తప్పకుండా రెడ్ సంస్థ సరుకులు పంపిణీ చేయడం అభినంద నీయమన్నారు. ప్రతీ ఒక్కరూ సేవా భావం పెంపొం దించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ మండలి కార్యదర్శి విష్ణు వందన, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు తనూజ రెడ్డి, సభ్యులు స్నేహలత రెడ్డి, శశిరేఖ, లక్ష్మి, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, కోడిపర్తి శ్రీధర్, పల్లం వెంకటేశ్వర్లు, శ్రీనివాసఆచారి పాల్గొన్నారు.

'విద్యుత్ షాక్.. కారకులపై చర్యలు తీసుకోవాలి'


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అడవి పందులను వేటాడటం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు తగిలి షాక్‌కు గురై తన రెండు కాళ్లు దెబ్బతిన్నాయని, తనకు జరిగిన అన్యాయంపై గత నెల 27వ తేదీ ఫిర్యాదు చేసినా బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని చంద్రగిరి నియోజక వర్గం, చిన్నగొట్టిగల్లు మండలం, దిగవూరు గ్రామం పాలమాకుల పల్లికి చెందిన శారద వాపోయింది. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ గత నెల 6వ తేదీ తాను కౌలు చేసుకుంటున్న పొలం వద్ద గొర్రెపిల్ల కలబడక పోవడంతో వెతుక్కుంటూ వెళుతూ సమీపంలోని ఉమాశేఖర్ అనే వ్యక్తి ఇం మరి కొందరు అడవి పందుల వేట కోసం విద్యుత్ లైన్లను మామిడి తోటలో ఏర్పాటు చేశారని, అది గమనించక వెళుతున్న సమయంలో కాలికి విద్యుత్ తీగ తగిలి పడిపోయానని తెలిపారు. తన కుమార్తె లక్ష్మీ భవాని గమనించి కాపాడిందన్నారు. ఈ విషయం గ్రామ పెద్దలకు తెలిసి న్యాయం కోసం పోరాడు తామని స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న తనకు హామీ ఇచ్చారని ఇప్పుడు ఎలాంటి న్యాయం చేయలేదని, బెదిరిస్తున్నారని తెలిపారు. తన కాళ్లు బాగు పడడానికి సుమారు 3 సంవత్సరాలు అవుతుందని వైద్యులు చెప్పారన్నారు. తన వైద్యానికి అయ్యే ఖర్చును ఇప్పించాలని, కలెక్టర్ అయినా తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో శారద సోదరి ధనలక్ష్మి పాల్గొన్నారు.

'స్టూడెంట్ నేషన్ వాలంటీర్స్ సేవలు అభినందనీయం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో స్టూడెంట్ నేషన్ వాలంటీర్స్ సేవలు అభినందనీయమని తిరుపతి–కరకంబాడి మార్గంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాథముని రెడ్డి అన్నారు. అన్నమాచార్య కళాశాలలో సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, బ్లడ్ బ్యాంక్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సాంకేతిక సహకారంతో కళాశాలకు చెందిన స్టూడెంట్ నేషన్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాథముని రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు 300 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ నేషన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు కె సాయి చౌదరి, డి త్రివిక్రమ్ రెడ్డి, అన్నమాచార్య కళాశాల ఛైర్మన్ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి నాదమునిరెడ్డి ప్రోత్సాహంతోనే ఇంతటి మెగా క్యాంప్ ని విజయవంతంగా నిర్వహించామన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ తరపున ప్రిన్సిపాల్ కు, స్టూడెంట్ నేషన్ కు షీల్డ్, అవార్డులు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు.

సమాచార హక్కు చట్టం పట్టించుకోరా..?

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల కేంద్రంలోని రాజాకు మారస్వామి రాజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సమాచార హక్కు చట్టాన్ని బేఖాతర్ చేస్తున్నారు. గతంలో కొన్ని సంవత్సరాల క్రితం పదవీ విరమణ చేసి అధ్యాపకురాలు పి.ఉమాసుందరి, అలాగే సంవత్సరం క్రితం బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ కే.బాలసుబ్రమణ్యంరాజు, అదే విధంగా జూన్లో పదవీ విరమణ పొందిన బంగారయ్య పేర్లు నేటికీ దర్శనమిస్తోంది. కళాశాల సమాచారం కోసం వచ్చే విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు సమాచార హక్కు బోర్డులో కళాశాల నుంచి వెళ్లిన వారి పేర్లు దర్శన మిస్తుం డటంతో అవాక్కు అవుతున్నారు. ఇప్పటికైనా సంబం ధిత అధికారులు స్పందించి సమాచార హక్కు బోర్డు లోని పేర్లు మార్చి ప్రస్తుతం విధుల్లో ఉంటున్న అధికా రుల పేర్లు నమోదు చేయాలని పలువురు కోరుతు న్నారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ పి.స్వరూప విధుల్లో చేరి సంవత్సరం కాలమైనా సమాచార హక్కుబోర్డుపై దృష్టి సారించక పోవడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలంటున్నారు.



పాత పేర్లతో దర్శనమిస్తున్న స.హ చట్టం బోర్డు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎస్ఎల్‌వి లేఅవుట్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. కోగిలేరు పంచాయతీ బసవరాజు కండ్రిక గ్రామానికి చెందిన సాయికిరణ్ (23)ద్విచక్ర వాహనంలో వెల్లుతుండగా ఎస్ఎల్ లేఅవుట్ వద్ద పలమనేరు నుంచి వస్తున్న స్కూల్ బస్సు ద్విచక్ర వాహనం ఢీకొనడంతో సాయికిరణ్‌కు తలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. స్థానికులు కారులో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వేలూరు సిఎంసికి తీసుకెళ్లాలని వారికి సూచించారు. వైద్యుల సూచన మేరకు సాయికిరణ్‌ను తీసుకెళ్తుండగా బంగారుపాళ్యం సమీపంలో పరిస్థితి విషమించిందని భావించి బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి సాయికిరణ్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతున్ని పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామం బసవరాజు కండ్రికకు తీసుకొచ్చినట్లు తెలిపారు. మృతుడు తల్లి వరలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.